www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 21 మార్చి 2024
5
అన్నమయ్య



ఫొటోగ్రఫీలో ఎఎఫ్ఎయూ విద్యార్థినికి బహుమతి

ప్రజాశక్తి-కడప అర్బన్

కడప నగరంలోని డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయ ఫొటోగ్రఫీ విభాగం నాల్గవ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని వి.తేజస్వినికి రాష్ట్ర స్థాయిలో మూడో బహుమతి లభించింది. హైదరాబాద్‌లో గత ఏడాది డిసెంబర్‌లో తెలంగాణ అటవీ శాఖ అధ్వర్యంలో కాసు బ్రహ్మానంద రెడ్డి (కెబిఆర్) నేషనల్ పార్క్ 25వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని "కెబిఆర్ త్రూ కెమెరా ఐస్"అనే థీమ్‌తో నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఫొటోగ్రఫీ పోటీల్లో బుధవారం వరల్డ్ స్పారో డే (ప్రపంచ పిచ్చుకల దినోత్సవం) సందర్భంగా వి.తేజస్విని తీసిన ఛాయచిత్రానికి తృతీయ బహుమతి లభించింది. ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ ఎం.సి.పార్గెన్ వారి చేతుల మీదుగా ఆమెకు రూ.5 వేలు నగదు బహుమతి, ప్రశంసాపత్రం అందుకున్నారు. విశ్వవిద్యాలయ విద్యార్థిని ప్రతిభ పట్ల డాక్టర్ వైఎస్ఆర్ ఏఎఫ్ఏయూ విసి ఆచార్య బి.ఆంజనేయప్రసాద్, రిజిస్ట్రార్ ఆచార్య ఇ.సి.సురేంద్రనాథ్‌రెడ్డి, ఫొటోగ్రఫీ విభాగం సమన్వయకర్త డాక్టర్ సంపత్ కుమార్ విద్యార్థిని తేజస్విని అభినందించారు.

టిడిపి ఎంపీ అభ్యర్థిత్వాలపై పీఠముడి

- పొత్తు పేరుతో స్పష్టత ఇవ్వని చంద్రబాబు
- రాజంపేట తెరపైకి మాజీ ముఖ్యమంత్రి కిరణ్?
- కడప పార్లమెంట్‌లో మరోసారి ఐవిఆర్ఎస్ సర్వే
- ఆశావహుల ఊగిసలాట.. కేడర్‌లో గందరగోళం

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లాలోని టిడిపి పార్లమెంట్ అభ్యర్థిత్వాలపై పీఠముడి పడింది. ఉమ్మడి కడప జిల్లాలో కడప, రాజంపేట పార్లమెంట్ అభ్యర్థిత్వాలపై టిడిపి సుదీర్ఘ కసరత్తు చేస్తోంది. తొలుత ప్రకటించిన అభ్యర్థిత్వాలను కాదని మరోసారి ఐవిఆర్ఎస్ సర్వేలు చేయిస్తోంది. వైఎస్ జగన్ తన సొంత జిల్లాలోని కడప, అన్నమయ్య పార్లమెంట్ స్థానాలకు ప్రకటించిన అభ్యర్థులకు ధీటైన అభ్యర్థులను ఖరారు చేయడంపై మరోసారి పరిశీలన చేస్తోంది. బిజెపితో కుదిరిన పొత్తు నేపథ్యంలో భాగంగా బిజెపి కేడర్‌లో ధీటైన అభ్యర్థులెవరైనా ఉన్నారా అనే కోణంలో పరిశీలిస్తోంది. తొలుత రాజంపేట పార్లమెంట్ స్థానానికి సుగవాసి బాలసుబ్రమణ్యం పేరును అనధికారికంగా ప్రకటించింది. రాయచోటి అసెంబ్లీ టికెట్‌కు పరిష్కారాన్ని కొనుగొంది. బిజెపితో పొత్తు కొలిక్కి రావడంతో బెడిసికొట్టింది. రాజంపేట పార్లమెంట్, అసెంబ్లీ టికెట్లపై అనిశ్చితి నెలకొంది.

రాజంపేట బరిలో బిజెపి?

రాజంపేట పార్లమెంట్‌ను బిజెపికి వదిలేయడంపై మీనమేషాలు లెక్కిస్తోంది. 2014లో రాజంపేట బరిలో ప్రస్తుత బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పురందేశ్వరి పోటీ చేసిన నేపథ్యాన్ని గుర్తు చేస్తోంది. 2024 సార్వత్రిక ఎన్నికల్లో బిజెపి అభ్యర్థిని బరిలో నిలిపేలా పావులు కదుపుతోంది. బిజెపి తరుపున పీలేరుకు చెందిన మాజీ ముఖ్య మంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి పేరును తెరపైకి వచ్చింది. ఈయన స్థానికులు, మాజీ ముఖ్యమంత్రి, రాజకీయ, ఆర్థిక, సామాజిక, అంగ బలాలు కలిగిన నాయకుడు కావడం, అధికార వైసిపి నాయకులతో బంధుత్వాలను కలిగి ఉండడం వంటి వంటి కారణాల రీత్యా ధీటైన అభ్యర్థిగా భావించినట్లు తెలుస్తోంది. రాజంపేట పార్లమెంట్ అభ్యర్థిగా బరిలో నిలిపే ఆలోచన ఆచరణలో పెట్టే ఆలోచన సాగిస్తోం ది. దీనిపై మాజీ ముఖ్యమంత్రి కుటుంబం నుంచి ఎటువంటి వ్యతిరేకత రాకపోవడంతో ఊహాగానాలకు బలం చేకూరినట్లు అవుతోంది.

రాయచోటి అసెంబ్లీలో అనిశ్చితి..

రాజంపేట టిడిపి పార్లమెంట్ అభ్యర్థిగా ఎస్.బాలసుబ్రమణ్యం పేరును తప్పించడంతో రాయచోటి టిడిపి అసెంబ్లీ అభ్యర్థికి కష్టాలు తప్పవని తెలుస్తోంది. పార్లమెంట్ పరిధిలోని 14,02,808 ఓటర్లలో బలిజ సామాజికవర్గానికి చెందిన ఓట్లు గణనీయమైన సంఖ్యలో ఉన్నారు. రాయచోటి అసెంబ్లీ పరిధిలోని బలిజ ఓటర్లలో భారీగా చీలికి రానున్నట్లు తెలుస్తోంది. ఇది ప్రత్యర్థికి లాభించే అవకాశం ఉంది. టిడిపి అభ్యర్థి రాంప్రసాద్‌రెడ్డి రాజకీయ కుటుంబానికి చెందిన నాయకుడు, యువకుడు కావడంతో ఆర్ఆర్, సుగవాసి కుటుంబాలకు రాజకీయ అభద్రత ఏర్పడింది. రాంప్రసాద్‌రెడ్డి గెలిపిస్తే తమ రాజకీయ జీవితాలపై తీవ్ర ప్రభావం పడనుందనే ఆందోళన నెలకొంది. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో రాయచోటి టిడిపి అభ్యర్థి గెలుపును సందిగ్ధంలో పడేసినట్లు అవుతోందనే వాదన వినిపిస్తోంది.

మిథున్‌రెడ్డి ఎన్నికల ప్రచారం లేనట్లే!

వైసిపి రాజంపేట పార్లమెంట్ అభ్యర్థిగా సిట్టింగ్ ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి పేరును ప్రకటించింది. తూర్పుగోదావరి జిల్లా పిఠాపురంలో జనసేన అధ్యక్షులు పవన్‌కల్యాణ్ పోటీ చేస్తున్న నేపథ్యం తెలిసిందే. పవన్‌ను ఓడించాలనే లక్ష్యంతో మిథున్‌రెడ్డిని వైసిపి అధిష్టానం పిఠాపురం ఇన్‌ఛార్జిగా నియమించింది. ఆయన రాజంపేట పార్లమెంట్ బరిలో ఎన్నికల ప్రచారానికి హాజరయ్యే అవకాశాలు తక్కువగా ఉన్నాయనే వాదన వినిపిస్తోంది. ఇటువంటి పరిస్థితుల్లో రాజంపేట పార్లమెంట్ బరిలో నుంచి ఎస్.బాల సుబ్రమణ్యం పేరును తప్పించడం చర్చనీయాంశంగా మారింది.

కడప పార్లమెంట్‌లోనూ గందరగోళమే

కడప పార్లమెంట్ అభ్యర్థి ఎంపికలో గందరగోళం నెలకొంది. పార్లమెంట్ అధ్యక్షులు ఆర్.శ్రీనివాసరెడ్డిని కాదని, మాజీ ఎమ్మెల్యే వీరశివారెడ్డి పేరుపై ఐవిఆర్ఎస్ సర్వే చేయడం విమర్శలకు ఆస్కారాన్ని కలిగించింది. వీరిలో రాజకీయ, ఆర్థిక, సామాజిక, అంగ బలాలు కలిగిన వారిలో ఆర్.శ్రీనివాసరెడ్డి ముందంజలో ఉన్న సంగతి తెలిసిందే. కానీ టిడిపి అధినాయకత్వం డోలాయమానంలో పడింది. ఇంతలో ఇటీవల వైసిపి అధ్యక్షులు వైఎస్ జగన్ ధైర్యంగా సిట్టింగ్ ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పేరు ప్రకటించారు. కానీ ప్రతిపక్ష టిడిపి పార్లమెంట్ స్థానానికి అభ్యర్థి కోసం వెంపర్లాడుతుండడం బలహీనతను గుర్తు చేస్తోంది. వైసిపి ఎంపీ అభ్యర్థి వైఎస్ అవినాష్‌రెడ్డి రాష్ట్రంలోని ఇతర ఎంపీలెవరూ ఎదుర్కోనన్ని విమర్శలు ఎదుర్కొంటున్నప్పటికీ, టిడిపి అభ్యర్థి కోసం వెంపర్లాతుండడం గమనార్హం. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో ప్రతిపక్ష టిడిపి జిల్లాలోని పార్లమెంట్ స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేసుకోలేని దుస్థితిని ఎదుర్కొంటు న్న నేపథ్యంలో ఆశావహులను, కేడర్‌ను ఆందోళనకు గురి చేస్తోంద నడంలో సందేహం లేదు.

అధైర్య పడొద్దు.. అండగా ఉంటాం

- 'నిజం గెలవాలి'లో నారా భువనేశ్వరి

ప్రజాశక్తి-గాలివీడు

అధైర్య పడవద్దు, అన్నివేళలా అండగా మీకు మేమున్నామని మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సతీమణి నారా భువనేశ్వరి పేర్కొన్నారు బుధవారం మండలంలో ఆమెకు తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు భారీ ఎత్తున చేరుకొని స్వాగతం పలికారు. నిజం గెలవాలి కార్యక్రమంలో భాగంగా ఎగవ గొట్టివీడు గ్రామంలో నాగన్నగుట్ట పాలెంకు చెందిన సర్పంచ్ ప్రభాకర్ నాయుడు కుటుంబాన్ని పరామర్శించారు. చంద్రబాబు అరెస్టుని జీర్ణించుకోలేక గుండెపోటుతో ప్రభాకర్‌నాయుడు సతీమణి రెడ్డమ్మ మరణించారు. రెడ్డమ్మ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా భువనేశ్వరి మాట్లాడుతూ అన్యాయాన్ని ఎదుర్కొని నిజాన్ని గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. తెలుగుదేశం పార్టీ ఎల్లవేళలా మీ కుటుంబానికి అండగా ఉంటుందని భరోసా కల్పించారు. సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పాలనపై విరుచుకుపడ్డారు. గత ఐదేళ్ల పాలనలో తెలుగుదేశం పార్టీ నేతలు కార్యకర్తలతో పాటు ప్రజలు అనేక రకాల సమస్యలను ఎదుర్కోవాల్సి వచ్చిందన్నారు. కక్ష సాధింపు చర్యలతోనే అనేక మందిని అక్రమ అరెస్టులకు గురిచేసి మానసిక క్షోభకు గురిచేశారన్నారు. రానున్న రెండు నెలల్లో ప్రతి తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, కుటుంబ సభ్యులు ప్రతి ఒక్కరూ ధైర్యంగా నిలబడి నిర్భయంగా ఓటు వేసి వేయించి తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు సిఎం చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని పేర్కొన్నారు. తాను కూడా రాయలసీమ పౌరుషం కలిగిన బిడ్డనని ఎటువంటి భయాలకు భయపడే ప్రసక్తే లేదని తెలిపారు. వైసిపి అరాచకాలను ప్రజలలోకి తీసుకువెళ్లి తెలుగుదేశం పార్టీని గెలిపించేందుకు మీ అందరి కృషితో ముందుకు వెళతానని స్పష్టం చేశారు. చంద్రబాబు నాయుడు ప్రజలకు మేలు చేసే వ్యక్తి గాని కీడు చేసే వ్యక్తి కాదని, జగన్మోహన్‌రెడ్డి కక్ష సాధింపుతోనే అక్రమ అరెస్టులు చేసినప్పటికీ తప్పు చేసినట్లు నిరూపించలేకపోయారని విమర్శించారు. **రాయచోటి :** స్థానిక రింగ్ రోడ్డులో టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిషోర్ కుమార్‌రెడ్డి, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డి, టిడిపి పార్లమెంట్ అభ్యర్థి సుగువాసి బాలసుబ్రమణ్యం, రాజంపేట టిడిపి జిల్లా అధ్యక్షులు చమర్తి జగన్మోహన్ రాజు, రాయచోటి అసెంబ్లీ అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ఘన స్వాగతం పలికారు. అనంతరం పట్టణంలోని రాజుల కాలనీలో మృతి చెందిన టిడిపి కార్యకర్త ఎం.రవీంద్రరాజు కుటుంబాన్ని భువనేశ్వరి పరామర్శించారు. **పీలేరు:** పీలేరులో పోలీసులు అత్యుత్సాహాన్ని ప్రదర్శించి మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరి కాన్వాయ్‌లోని ఐదవ వాహనాన్ని అడ్డుకున్నారు. నిజం గెలవాలి కార్యక్రమంలో భాగంగా అన్నమయ్య జిల్లా రాయచోటి నియోజకవర్గంలోని గాలివీడుకు వెళుతున్న భువనేశ్వరికి పీలేరులో టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిషోర్ కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆ పార్టీ శ్రేణులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె అందరికీ అభి వాదం చేస్తూ, ఆప్యాయంగా పలకరించారు. అనంతరం పీలేరు నుంచి గాలివీడుకు బయలుదేరిన కాన్వాయ్‌లో భువనేశ్వరి పిఎ ప్రయాణం చేస్తున్న వాహనాన్ని పోలీసులు అడ్డుకున్నారు. పోలీసులు, టిడిపి శ్రేణుల మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. సుమారు అరగంట మేరకు వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం చోటుచేసుకుంది. ఈ సందర్భంగా పోలీసులు మీడియా వాహనాన్ని సైతం అడ్డుకోవడంతో మీడియా ప్రతినిధులు, ఇతర వాహనదారులు తమ అసహనాన్ని వ్యక్తం చేశారు. భువనేశ్వరికి స్వాగతం పలికిన వారిలో నల్లారి కిషోర్ కుమార్‌రెడ్డితో పాటు తిమ్మాపురం రఘునాథరెడ్డి, వారణాసి శ్రీకాంత్‌రెడ్డి, కోటపల్లి బాబురెడ్డి పాల్గొన్నారు. **కలకడ:** భువనేశ్వరికి మండల కేంద్రమైన కలకడలో ఘన స్వాగతం పలికారు. తెలుగు తమ్ముళ్లు బాణసంచా పేలిచే ఆమెకు స్వాగతం పలికి ఘనంగా సన్మానించారు. స్వాగతం పలికిన వారిలో కిషోర్ కుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీ అనురాధ, మండల పార్టీ అధ్యక్షులు ప్రభాకర్ నాయుడు, సర్పంచులు గుర్రం శివ, వెంకటరమణ, విశ్వనాథ నాయుడు, లక్ష్మి ప్రసన్న కుమారి, మండల నాయకులు మద్దిపట్ల సూర్య ప్రకాష్ నాయుడు, మల్లారపు రవి ప్రకాష్ నాయుడు, బరకం శ్రీనివాసులురెడ్డి, మాజీ జడ్‌పిటిసి తిరుపతి నాయుడు, దగ్గుపాటి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



రాయచోటి : బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న భువనేశ్వరి





కమిషనర్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న సిఐటియు నాయకులు

పెండింగ్ వేతనాలు చెల్లించాలి: 'సిటు '

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

మున్సిపల్ కార్మికుల పెండింగ్ వేతనాలు, సమ్మె హామీలు అమలు చేయడంలో కమిషనర్ జాప్యం విడనాడాలని సిఐటియు జిల్లా గౌరవ అధ్యక్షులు ఎ.రామానుజులు, జిల్లా అధ్యక్షులు సిహెచ్.చంద్రశేఖర్, ఉపాధ్యక్షులు రవికుమార్ పేర్కొన్నారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ రాంబాబుకు బుధవారం వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో నిర్వహించిన 16 రోజుల సమ్మె ఫలితంగా ప్రభుత్వం చర్చలలో అంగీకరించి జిఒలు జారీ చేసినా సాంకేతిక సమస్యల పేరుతో రెండు నెలల వేతనాలు, సమ్మె కాలపు వేతనం, సంక్రాంతి కానుక వెయ్యి రూపాయలు, డ్రైవర్లకు రూ 24,500 చెల్లించకుండా మూడు నెలలుగా కార్మికులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన చెందారు. కార్మికుల శ్రమను, వారి పోరాటాలను తక్కువ చేస్తే గుణపాఠం తప్పదని హెచ్చరించారు. జిల్లాలో మదనపల్లి, రాయచోటిలో వేతనాలు మంజూరు చేశారని రాజంపేట కమిషనర్ నిర్లక్ష్య వైఖరి, శానిటేషన్ అధికారుల నిర్లక్ష్యం వల్ల జీతాలు పెండింగ్‌లో ఉన్నాయని, వారిపై శాఖా పరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈనెల 25వ తేదీ లోపు జీతాలు చెల్లించకుంటే 26 నుంచిసమ్మె చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ నాయకులు ప్రసాద్, మంగమ్మ, లక్ష్మణ్, కిరణ్, లక్ష్మీదేవి పాల్గొన్నారు.


వ్యక్తిగత ఆరోగ్యంపై అవగాహన కలిగి ఉండాలి

ప్రజాశక్తి-పీలేరు

ప్రతి ఒక్కరూ వ్యక్తిగత ఆరోగ్య రక్షణ పట్ల అవగాహన కలిగి ఉండాలని అప్పుడే ఆరోగ్యకర సమాజ నిర్మాణం సాధ్యమని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ పీలేరు బ్రాంచ్ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ పి.చంద్రశేఖర్, డాక్టర్ పవన్‌కుమార్ తెలిపారు. బుధవారం పీలేరు ఎంజెఆర్ ఇంజినీరింగ్ కాలేజ్ యాజమాన్యం సహకారంతో ఐఎంఎ, పీలేరు ప్రాంతీయ ఆస్పత్రి సంయుక్త ఆధ్వర్యంలో కళాశాల ఆవరణంలో రక్తదాన శిబిరంతో పాటు యుక్త వయస్సు గల అమ్మాయిల్లో ఎదురయ్యే రక్తహీనత, ఋతుస్రావం సమస్యలు, శానిటరీ నాప్కిన్స్ వినియోగం గురించి వైద్యులు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ అవినాష్ కుమార్ రెడ్డి, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సుధాకర్ రెడ్డి, ఐఎంఎ పీలేరు బ్రాంచ్ అధ్యక్షులు డాక్టర్ చంద్రశేఖర్, కార్యదర్శి డాక్టర్ పవన్‌కుమార్, కోశాధికారి డాక్టర్ ఈశ్వర సురేంద్ర, సీనియర్ గైనకాలజిస్ట్ డాక్టర్ మమతా శ్రీనివాస్ గుప్త, సీనియర్ ఫిజిషియన్ డాక్టర్ నాగవేణి, ఫిజీషియన్ డాక్టర్ శ్వేతా రాణి, హెల్త్ కౌన్సిలర్ రాజేశ్వరి పాల్గొన్నారు.

నేటి రక్తదానం రేపటి ప్రాణదానం

నేటి రక్తదానం రేపటి ప్రాణదానమని ఎంజెఆర్ ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ ఎంపి.అవినాష్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. ఎంజెఆర్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ వ్యవస్థాపక చైర్మెన్ మంచూరి వెంకటరమణారెడ్డి తృతీయ వర్ధంతి సందర్భంగా బుధవారం కళాశాలలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. పీలేరు ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రం సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ రక్తదానం విషయంలో కొందరిలో కొన్ని రకాల అపోహలు ఉన్నాయని, వాటిని ఎవరూ నమ్మవద్దని సూచించారు. విద్యార్థులు, సిబ్బంది స్వచ్ఛందంగా పాల్గొని 102 యూనిట్ల రక్తం దానం చేశారని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్.సుధాకర్ రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ ఈశ్వర సురేంద్ర, డాక్టర్ నాగవేణి, డాక్టర్ మమతా లక్ష్మి, డాక్టర్ అమరావతి, కళాశాలకు చెందిన వివిధ విభాగాధిపతులు, సిబ్బంది పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న ఐఎంఎ బృందం సభ్యులు

బ్రహ్మోత్సవాల ఏర్పాట్లు వేగవంతం చేయాలి : ఇఒ

ప్రజాశక్తి-ఒంటిమిట్ట

ఒంటిమిట్ట శ్రీకోదండరామస్వామి ఆలయంలో ఏప్రిల్ 16న అంకురార్పణ, ఏప్రిల్ 17న శ్రీరామనవమి పర్వదిన ధ్వజారోహణంతో ప్రారంభమయ్యే బ్రహ్మోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించాలని టిటిడి ఇఒ ఎవి.ధర్మారెడ్డి అధికారులను ఆదేశించారు. బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై బుధవారం తిరుపతిలోని టిటిడి పరిపాలన భవనంలోని సమావేశ మందిరంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ 22న జరుగనున్న శ్రీసీతారాముల కల్యాణం ఏర్పాట్లను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. కల్యాణం రోజున వచ్చే వేలాది మంది భక్తులకు అవసరమైన అన్నప్రసాదం, తాగునీరు, మజ్జిగ అందించేందుకు చక్కటి ఏర్పాట్లు చేయాలన్నారు. అన్ని విభాగాలు ప్రత్యేక కార్యాచరణ రూపొందించుకుని కల్యాణం రోజున భక్తులకు అందాల్సిన సౌకర్యాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. ఎండ వేడిమి నుంచి ఉపశమనం కల్పించేందుకు భక్తులు నడిచే ప్రాంతాల్లో కూల్ పెయింట్ వేయాలని, అవసరమైన చోట్ల చలువపందిళ్లు ఏర్పాటు చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఊరేగింపు నిర్వహించే వాహనాలు, రథానికి సంబంధించిన పటిష్టతను పరిశీలించి ఫిట్‌నెస్ సర్టిఫికేట్ తీసుకోవాలన్నారు. సీతారాముల తలంబ్రాల ప్యాకింగ్‌కు 300 మంది, కల్యాణం రోజున భక్తులకు అన్నప్రసాదాలు, తలంబ్రాల పంపిణీకి దాదాపు 2 వేల మంది శ్రీవారి సేవకులను సిద్ధం చేసుకోవాలన్నారు. అత్యవసర వైద్య పరిస్థితుల్లో వెంటనే స్పందించేందుకు వీలుగా అంబులెన్సులు సిద్ధంగా ఉంచుకోవాలని, ప్రథమ చికిత్స కేంద్రాలు ఏర్పాటుచేసి తగినన్ని ఓఆర్ఎస్ ప్యాకెట్లు సిద్ధంగా ఉంచుకోవాలని వైద్య అధికారులకు సూచించారు. సాంస్కృతిక, సంగీత కార్యక్రమాలకు సంబంధించిన ప్రణాళిక త్వరితగతిన సిద్ధం చేయాలన్నారు. కల్యాణం రోజున భక్తుల రవాణా, వసతి, పార్కింగ్ కల్పించేందుకు ఆర్‌టిసి అధికారులతో సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు. అన్ని విభాగాల అధికారులు పూర్తి సన్నద్ధంగా ఉండి వైఎస్ఆర్ జిల్లాలోని ఆయా విభాగాల అధికారులతో సమన్వయం చేసుకోవాలన్నారు. సమావేశంలో జెఇఒ వీరబ్రహ్మం, సివిఎస్ఒ నరసింహ కిషోర్, ఎస్‌విబిసి సిఇఒ షణ్ముఖ కుమార్, సిఇ నాగేశ్వరరావు, ఎస్ఇలు జగదీశ్వర్‌రెడ్డి, సత్యనారాయణ, వెంకటేశ్వర్లు, ఎస్టేట్ ఆఫీసర్ గుణభూషణరెడ్డి, డెప్యూటీ ఇఒలు నటేష్ బాబు, ప్రశాంతి, అన్ని విభాగాల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న టిటిడి ఇఒ ధర్మారెడ్డి

ప్రశాంత ఎన్నికలకు సహకరించండి : కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అభిషిక్త్ కిషోర్

ప్రజాశక్తి-రాయచోటి

ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు రాజకీయ పార్టీ ప్రతినిధులు సహకరించాలని జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ రాజకీయ పార్టీ నాయకులను కోరారు. బుధవారం కలెక్టరేట్ లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో ఎన్నికల నిర్వహణపై వివిధ రాజకీయ పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వచ్చే సాధారణ ఎన్నికలలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహించేందుకు రాజకీయ పార్టీలు పూర్తి సహాయ సహకారాలు అందించాలన్నారు. జిల్లాలో ఎక్కడైనా ఎంసిసి వైలేషన్స్ జరిగినట్లయితే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. జిల్లాలో ఎన్నికల కోడ్ అమలులో ఉందని ప్రతి ఒక్కరూ ఎంసిసి నిబంధనలు తప్పక పాటించాలన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి పాటించని వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. కుల, మత, ప్రాంతీయపరమైన విద్వేషాలు చేయడం, రెచ్చగొట్టేలా రాజకీయనేతలు ప్రవర్తించకూడదన్నారు. మసీదులు, చర్చిలు, దేవాలయాలు, ఇతర ప్రార్థన స్థలాల్లో ఎన్నికల ప్రచారం చేయకూడదన్నారు. అనుమతి లేకుండా బ్యానర్లు కట్టడం, లౌడ్ స్పీకర్లు ఏర్పాటు చేయడం, డబ్బులు పంపిణీ చేయడం, గోడలపై నినాదాలు రాయడం, పోస్టర్లు అతికించకూడదని సూచించారు. ఎన్నికల నిర్వహణ అధికారులు సివిజిల్ ద్వారా అందే ఫిర్యాదులపై తక్షణం స్పందించి సకాలంలో సమస్యలు పరిష్కరించాలని తెలిపారు. ఎన్నికల సంఘం రూపొందించిన సి - విజిల్, నో యువర్ కాండిడేట్, ఓటర్ హెల్ప్ లైన్, వంటి యాప్‌లను గూగుల్ ప్లే స్టోర్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చని, వాటి ద్వారా చాలా సమాచారాన్ని పొందవచ్చని తెలిపారు. డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నుంచి పోలింగ్ సిబ్బందికి పోలింగ్ మెటీరియల్ అందించడంలో ఎలాంటి లోటుపాట్లు ఎదురుకాకుండా తగు ఏర్పాట్లు చేయాలని అన్నారు. ప్రతిరోజు వార్తా పత్రికలలో వచ్చే అడ్వర్స్ న్యూస్ పై అధికారులు వెంటనే స్పందించాలని చెప్పారు. జిల్లాలోని అన్ని మండలాల ఎంపిడిఒలు ఎంసిసి వై లైసెన్స్ జరగకుండా పర్యవేక్షణ చేస్తూ ఉండాలని అన్నారు. రిటర్నింగ్ అధికారులు పోలీస్ చెక్ పోస్ట్ లను తరచూ తనిఖీ చేస్తూ ఉండాలని ప్రతి చెక్ పోస్ట్ నందు వీడియోగ్రఫీ చేయించాలని పేర్కొన్నారు. నామినేషన్ల స్వీకరణకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నామినేషన్ జరిగే సమయంలో వీడియో గ్రఫీ, ఫొటో గ్రఫీ తప్పక చేయించాలన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఫర్మన్ అహ్మద్‌ఖాన్, ఎఎస్పి డాక్టర్ రాజ్‌కమల్, డిఆర్ఒ సత్యనారాయణ, రాయచోటి, మదనపల్లి, రాజంపేట ఆర్‌డిఒలు రంగస్వామి, హరిప్రసాద్, మోహన్‌రావు, ఆర్ఒలు, నోడల్, అధికారులు రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

26న జడ్‌పి సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - కడప అర్బన్ : జిల్లా ప్రజా పరిషత్ కడప ఉమ్మడి జిల్లా ప్రజా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం ఈ నెల 26న నిర్వహిస్తున్నట్లు సిఇఒ సుధాకర్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని తెలిపారు.

వైవీయూ పరిశోధన విద్యార్థికి రూ.30 లక్షల ఫెలోషిప్

ప్రజాశక్తి-కడప అర్బన్ : యోగి వేమన విశ్వా విద్యాలయం, జియాలజి శాఖ డీఎస్టీ ఇన్‌స్పైర్ ఫెలో పరిధిలో పిహెచ్‌డి పూర్తిచేసిన డాక్టర్ బాదపల్లి ప్రదీప్ కుమార్‌కి భారత ప్రభుత్వ డిపార్ట్మెంట్ అఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ-సైన్స్ అండ్ ఇంజినీరింగ్ బోర్డు నేషనల్ ఫెలోషిప్ కింద పరిశోధన కోసం రూ.30 లక్షల ఫెలోషిప్ మంజూరు చేశారు. క్లైమేట్ చేంజ్ ఇంపాక్ట్ ఆన్ ల్యాండ్ డీగ్రేడషన్ అనే అంశం మీద పరిశోధనలు చేయడం కోసం నేషనల్ జిఒఫీసికాల్ రీసెర్చ్ ఇన్ స్టిట్యూట్ సిఎస్ఐఆర్ శాస్త్రవేత్త డాక్టర్ సక్రం మార్గదర్శనంలో ఈ పరిశోధనలు చేయ బోతున్నారు. విశ్వవిద్యాలయంలో ఆచార్య కె.రఘుబాబు మార్గదర్శకంలో ప్రదీప్ కుమార్ ఇదివరకే పిహెచ్‌డి పూర్తి చేశారు. ఈ సందర్భంగా విసి ఆచార్య చింతా సుధాకర్, రిజిస్ట్రార్ వై.పి.వెంకటసుబ్బయ్య, ప్రిన్సిపల్ ఆచార్య రఘునాథరెడ్డి, డీన్ ఫాకల్టీ అఫ్ సైన్సెస్ ఆచార్య కృష్ణారెడ్డి, ప్రదీప్ కుమార్‌ను అభినందించారు.

ఐటిఐలో క్యాంపస్ డ్రైవ్

ప్రజాశక్తి - కడప అర్బన్ : ప్రభుత్వ ఐటిఐలో ఈ నెల 23న క్యాంపస్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు ఎడి రత్నరాజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జెవై సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్, టెక్ మహేంద్ర కంపెనీ వారు డ్రైవ్ నిర్వహిస్తున్నారని తెలిపారు. ఉదయం 10 గంటలకు హాజరు కావాలని పేర్కొన్నారు. ఐటిఐ, ఇంటర్, డిగ్రీ చదివిన వారు హాజరు కావాలని తెలిపారు.



ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపల్ యువరాజ్

జాతీయ స్థాయిలో 'మిట్స్' విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-మదనపల్లి

మదనపల్లి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్‌లో బిటెక్ - కంప్యూటర్ సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగంలో మూడవ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు ఆవిష్కార్-స్టూడెంట్ ఇన్నోవేషన్ కాంపిటిషన్ ఫర్ స్టార్ట్ అప్‌లో ఐడియా ప్రజెంటేషన్ ఈవెంట్ లో ప్రతిభ కనపరిచి జాతీయ స్థాయిలో విజేతలుగా నిలిచినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.యువరాజ్ తెలిపారు. మంగళగిరి లోని కె.ఎల్ యూనివర్సిటీలో జరిగిన పోటీలలో సి.ప్రణతి, లక్ష్మితనూజ, నాగశ్వేతలు ఐడియా ప్రెజెంటేషన్ ఈవెంట్‌లో సెమి రోబోటిక్ వీడ్ కట్టర్ అండ్ సాయిల్ మానిటరింగ్ సిస్టంను ప్రదర్శించి నందుకు గాను జాతీయ స్థాయిలో టాప్ 3వ స్థానంలో నిలిచినట్లు తెలిపారు. గెలుపొందిన విద్యార్థులకు ప్రశంసా పత్రంతో పాటు జ్ఞాపికను అందించారని చెప్పారు. ప్రతిభ చాటిన విద్యార్థులను కరస్పాండెట్ డాక్టర్ ఎన్.విజయ భాస్కర్ చౌదరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి నాదెళ్ల, విభాగాధిపతి డాక్టర్ శ్రీదేవి అభినందనలు తెలిపారు.



ర్యాలీ నిర్వహిస్తున్న అన్నమాచార్య కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ప్రజలు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండి ఆరోగ్యాన్ని సంరక్షించుకోవాలని అన్నమాచార్య ఫార్మసీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ బృంద సభ్యులు పేర్కొన్నారు. బోయినపల్లిలోని అన్నమాచార్య ఫార్మసీ కళాశాల ఎన్ఎస్ఎస్ బృందం వారు బుధవారం ప్రత్యేక క్యాంపు ఏర్పాటు చేసి కళాశాల నుంచి బోయినపల్లి వరకు ర్యాలీ నిర్వహించి మాదకద్రవ్యాలు, మద్యపానం, ధూమపానం వలన కలిగే దుష్ప్రభావాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కళాశాల కార్యనిర్వహణ అధికారి వై.ప్రదీప్ కుమార్ మాట్లాడుతూ మద్యం సేవించడం వలన కాలేయం, గుండె ఇతర ముఖ్యమైన అవయవాలు దెబ్బతింటాయని, కాలేయ క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉందని తెలిపారు. మద్యపానం మెదడును ప్రభావితం చేస్తుందని, కుటుం బంలో మానవ సంబంధాలను దెబ్బతీస్తాయని అన్నారు. ధూమపానం వలన శ్వాసకోశ వ్యాధులు, న్యుమోనియా, గుండె సంబంధిత వ్యాధులు వస్తాయని అన్నారు. ధూమపానం చేసేవారే కాకుండా ఆ పొగను పీల్చే పక్క వారు కూడా ఊపిరితిత్తులు, గొంతు క్యాన్సర్ వ్యాధి బారిన పడే ప్రమాదం ఉందని అన్నారు. ఈ వ్యాధులు అరికట్టడానికి ప్రతి ఒక్కరూ చైతన్యవంతులు కావాలని సూచించారు. కళాశాల కార్యదర్శి చొప్పాగంగిరెడ్డి, కోశాధికారి అబిషేక్‌రెడ్డి, వైస్‌చైర్మన్ ఎల్లారెడ్డి, చైర్మన్ సి.రామచంద్రారెడ్డి, కళాశాల ప్రిన్సిపల్ డి.స్వర్ణలత మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ ప్రత్యేక క్యాంపు ద్వారా అన్నమాచార్య కళాశాల సమాజానికి ఎన్నో సేవలు అందిస్తోందని తెలిపారు.

రంజాన్ వేళలు



ఇఫ్తార్ గురువారం (సా)	షహరీ శుక్రవారం (ఉ)
6.30	5.03


వృథాగా పోతున్న తాగునీరు

తాగునీటి వృథాను అరికట్టలేరా?

ప్రజాశక్తి- కలకడ

మండల కేంద్రమైన కలకడ పోలీస్ స్టేషన్ ఎదుట నీరు యధేచ్ఛగా వృధాగా పోతున్నా సంబంధిత అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదని స్థానిక పేర్కొంటున్నారు. గతంలో స్థానిక ఝరికోన ప్రాజెక్టు నుంచి అప్పటి ఉమ్మడి రాష్ట్రాల ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి చొరవతో కెవిపల్లి, కలకడ, కలికిరి మండలాలకు నీటిని సరఫరా చేసేందుకు పైపులైన్లకు మంమ్మతు చేయించి నీటి వృధాను అరికట్టారు. స్థానిక పోలీస్ స్టేషన్ ఎదుట ఉన్న పంచాయతీ పైపులైను పగిలిపోయి నిత్యం నీరు పోతున్నా స్థానిక అధికారులు కానీ, పంచాయతీ సిబ్బంగిగానీ చర్యలు తీసుకోడం లేదని ప్రజల నుంచి విమర్శలు వస్తున్నాయి. ప్రస్తుతం వేసవి కాలంలో నీటి కొరత అధికంగా ఇలా నీరు వృథా ఆపకపోవడం విడ్డూరంగా ఉందని విమర్శలు వస్తున్నాయి. పంచాయతీ కార్యాలయానికి చెందిన తాగునీరు వృథాగా పోతున్న విషయం గుర్తించామని, వెంటనే పైపులను మరమ్మత చేయించి చర్యలు తీసుకుంటామని పంచాయతీ కార్యదర్శి దేవేంద్ర వివరించారు.

ప్రయివేట్ స్కూళ్లలో ఉచిత ప్రవేశాలు : ఎంఇఒ

ప్రజాశక్తి-బి.కొత్తకోట

విద్యా హక్కు చట్టం ప్రకారం బెస్ట్ అవెలబుల్స్ స్కూళ్లలో ఒకటవ తరగతిలో ప్రవేశాలకు అర్హులైన చిన్నారుల తల్లిదండ్రులు గ్రామ,వార్డు సచివాలయాలు, ఎంఇఒ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని ఎంఇఒ రెడ్డిశేఖర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన మాట్లాడుతూ మార్చి 5వ తేదీ నుంచి దరఖాస్తులు చేసుకునే అవకాశం ఉండగా, మార్చి 25 ఆఖరి తేదీ అని తెలిపారు.5 సంవత్సరాలు నుంచి 6 సంవత్సరాల పిల్లలకు మాత్రమే అర్హులన్నారు.ఈ పిల్లలు జూన్ 02,2018 నుంచి మే 31,2019 మధ్యలో జన్మించి ఉండాలన్నారు. ఆన్‌లైన్‌లో సైతం దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందన్నారు. దరఖాస్తు చేసుకునేవారు విద్యార్థి ఆధార్, తల్లి ఆధార్, రేషన్ కార్డు, విద్యార్థి జనన ధ్రువీకరణ పత్రాలు కలిగి ఉండాలన్నారు. ఈ అవకాశాన్ని మండలంలోని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.


కిషోర్‌కుమార్‌రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

టిడిపిలో పలువురు చేరిక

ప్రజాశక్తి-కలికిరి

మండల పరిధిలోని మహల్ గ్రామపంచాయతీలో పలువురు వైసిపి నాయకులు పీలేరు టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి నల్లారికిషోర్ కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో టిడిపిలో చేరారు. ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ పార్టీ మెంబర్ అఫ్ పార్లమెంట్ ఇన్‌ఛార్జి పూల అన్వర్ హుస్సేన్ రాజీనామా చేసి ఐటి డిపి అధ్యక్షులు ఎస్‌పి.షబ్బీర్ హుస్సేన్ ప్రోత్సలంతో టిడిపిలో చేరినట్లు తెలి పారు. నలభై సంవత్సరాల రాజకీయ వైరాన్ని పక్కన పెట్టి కిషోర్‌కుమార్‌రెడ్డి గెలుపునకు కృషి చేస్తామని చెప్పారు. మాజీ సర్పంచ్ ఖాజా హుస్సేన్, ఆయన కుమారుడు పూల షేక్ అన్వర్ హుస్సేన్, ఆయన సతీమణి మహబూబ్‌జాన్, అబిద్ హుస్సేన్ టిడిపిలో చేరినట్లు తెలిపారు. వైసిపి ప్రభుత్వంలో ఎటువంటి అబివృద్ధి లేదని అందుకోసమే వైసిపిని వీడి టిడిపిలో చేరినట్లు తెలిపారు. కార్యక్రమం టిడిపి మండల పార్టీ అధ్యక్షులు నిజాముద్దీన్, మాజీ సర్పంచ్‌లు భాస్కర్‌రెడ్డి, మహమ్మద్ అలీ, నిజాముద్దీన్, వెంకటేష్ రెడ్డి, భాస్కర, మండల మైనార్టీ అధ్యక్షులు మున్నార్, మహమ్మద్ అలీ, బాబ్జి పాల్గొన్నారు.


జెసిబి యంత్రంతో జరుగుతున్న రోడ్డు నిర్మాణ పనులు

ప్రారంభమైన తారురోడ్డు నిర్మాణ పనులు

ప్రజాశక్తి-గాలివీడు

మండలంలోని గుర్రాలమిట్ట నుంచి కరిమిరెడ్డిగారిపల్లి వరకు 2.5 కిలోమీటర్ల వరకు తారురోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేయడానికి పనులు ప్రారంభించామని ఆర్‌అండ్‌బి ఎఇ యూసుఫ్ పేర్కొన్నారు. గాలివీడు నుంచి కోనంపేట వరకు ఉన్న పది కిలోమీటర్ల బిట్స్ ప్రారంభించామని వాటి పనులు కూడా త్వరగా పూర్తి చేస్తామని చెప్పారు. గాలివీడు పట్టణంలో అక్కడక్కడ సిమెంట్ లేకుండా తారు రోడ్డుకు మిగిలిపోయిన బిట్లు కూడా సకాలంలో పూర్తి చేస్తామని పేర్కొన్నారు.

కాంగ్రెస్ పార్టీతోనే రాష్ట్ర ప్రగతి : తులసిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

రాష్ట్ర ప్రగతి కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందని పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి అన్నారు. బుధవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌కు తీరని ద్రోహం చేసిం దన్నారు. రాష్ట్రానికి అవసరమై ప్రత్యేకహోదా అమలు చేయలేదని విమర్శించారు. విభజన చట్టం లో సెక్షన్ 46 సబ్ సెక్షన్ 3 ప్రకారం కేంద్ర ప్రభు త్వం రాయలసీమకు, ఉత్తరాంధ్రకు ప్రత్యేక అభివృద్ధి అమలు చేయాలన్నారు. రూ.24350 కోట్లకుగానూ పిల్లికి బిచ్చం వేసినట్లు ఈ పదేళ్లల్లో కేవలం మోడీ ప్రభుత్వం కేవలం రూ.10 50 కోట్ల మాత్రమే విడుదల చేసినట్లు చెప్పారు. కడప జిల్లాలో స్టీల్ ప్లాంట్ ఏర్పాటు కాలేదని విమర్శించారు. దుగ్గరాజపట్నం ఓడరేవు నిర్మాణం కాలేదన్నారు. కాంగ్రెస్ పార్టీకి అండగా నిలవాలని తులసిరెడ్డి కోరారు.

హంద్రీ-నీవా నుంచి సాగు, తాగునీరు అందిస్తాం

- మదనపల్లి టిడిపి అభ్యర్థి షాజహాన్‌బాషా

ప్రజాశక్తి-రామసముద్రం

హంద్రీనీవా కెనాల్ నుంచి రామసముద్రం మండలానికి సాగు నీరు, తాగునీరు అందించే బాధ్యత తనదేనని మాజీ ఎమ్మెల్యే , టిడిపి అభ్యర్థి షాజహాన్‌బాషా పేర్కొన్నారు. బుధవారం చెంబకూరు సమీపంలోని మూడు రోడ్ల కూడలిలో నాయకులు, అభిమానులు అనంతరం కర్ణాటక రాష్ట్రంలోని కురుడుమలై దేవాలయంలో వినాయకునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కురిజల పంచాయతీ లోని బరిడేపల్లి గ్రామంలో టిడిపి సూపర్ సిక్స్ పథకాల కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయిన అనంతరం మదనపల్లి నియోజకవర్గాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తానని అన్నారు. దాదాపు ఐదు సంవత్సరాలుగా అబివృద్ధి శూన్యంగా ఉందని, మనం ప్రజా జీవితంలో ఉన్నామని అన్నారు. వైసిపి నాయకులు ప్రజలకు మంచి చేసివుంటే శ్వేత పత్రం విడుదల చేయాలని అన్నారు. ప్రస్తుతం నిజంగా ప్రజ లకు మేలు చేసి ఉంటే ప్రజాకోర్టులో తేల్చుకోవాలని అన్నారు. టిడిపిని విమర్శించే అర్హత వైసిపి నాయకులకు లేదని, వైసిపి నాయకులు ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసా రని అన్నారు. రాబోయే ఎన్నికల అనంతరం రామసముద్రం మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపే బాధ్యత తమదేనని పేర్కొన్నారు. మానవ సేవే మాధవసేవ అనే లక్ష్యంతో ముందుకు సాగుతానని చెప్పారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు విజయకుమార్ గౌడ్, రాష్ట్ర యువత అధ్య క్షులు శ్రీరామ్ చినబాబు, ప్రదీప్‌రెడ్డి, రెడ్డిశేఖర్ రాటకొండ గుర్రప్ప నాయుడు, శ్రీనివాస్ గౌడ్, మాజీ జడ్‌పిటిసి శివశంకర్, ముని వెంకట స్వామి, చలపతి నాయుడు, శంకర్ నాయుడు, కోవా కృష్ణ, విద్యా సాగర్, ఆర్.జె వెంకటేష్, రామాంజులు పాల్గొన్నారు.


ప్రజలకు కరపత్రాలు అందిస్తున్న షాజహాన్ బాషా

వీరబల్లిలో 'బ్యాంక్ ఆఫ్ బరోడా' ప్రారంభం


బ్యాంక్‌ను ప్రారంభిస్తున్న ఎన్‌డిజిఎం గోవింద్ ప్రసాద్‌వర్మ

ప్రజాశక్తి-వీరబల్లి

భారతదేశంలోని ప్రముఖ ప్రభుత్వ రంగ బ్యాంకులలో ఒకటైన బ్యాంక్ ఆఫ్ బరోడా బ్యాంక్ బుధవారం ఎన్‌డిజిఎం గోవింద్ ప్రసాద్ వర్మ, ఎజిఎం అండ్ రీజనల్ హెడ్ అమర్నాథ్‌రెడ్డి, బ్రాంచ్ మేనేజర్ నాగవర్ధన్‌రెడ్డి, ఎంపిపి రాజేంద్రనాథ్‌రెడ్డి, వీర నాగిరెడ్డి, శ్రీధర్ రెడ్డి, జడ్‌పిటిసి శివరాం గౌడ్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బ్యాంక్ ఆఫ్ బరోడా అనేక రకాల కస్టమర్ల ప్రత్యేక అవసరాలను అందించడానికి అనేక రకాల పొదుపు ఖాతాలను అందిస్తుందని అన్నారు. బ్యాంక్ ఆఫ్ బరోడా సేవింగ్స్ ఖాతాను తెరవడం ద్వారా కస్టమర్‌లు తమ ఆర్థిక ఆస్తులను సులభంగా నిర్వహించుకోవచ్చు, వడ్డీని సంపాదించవచ్చని, లావాదేవీలు చేయవచ్చని చెప్పారు. దేశవ్యాప్తంగా బ్యాంకు శాఖలు నెట్‌వర్క్‌ను కలిగి ఉందని అన్నారు. ఇంటర్నెట్ బ్యాంకింగ్ ఎంపికను కూడా కలిగి ఉందని, ఖాతా యజమానులు ఆన్‌లైన్‌లో వివిధ లావాదేవీలను అమలు చేయడానికి వీలు కల్పిస్తుందని చెప్పారు. కస్టమర్‌లు బ్యాంక్ ఆఫ్ బరోడా సేవింగ్స్ ఖాతాను కూడా పొందవచ్చు అని తెలిపారు. బ్యాంకులో ఖాతా తెరవడానికి పాన్ కార్డ్, ఆధార్ కార్డు, ఓటర్ ఐడి కార్డ్,ప్రభుత్వం జారీచేసిన ఫోటో ఐడి కార్డ్, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు, తెచ్చుకుని 500 డిపాజిట్ చేయాలి అన్నారు. పాస్ బుక్‌తో పాటు, చెక్ బుక్, ఫీచర్‌తో వస్తుందన్నారు. సేవింగ్ బ్యాంకు ఖాతాదారులకు ఎటిఎం డెబిట్ కార్డులు వస్తాయని తెలిపారు. 25 సంవత్సరాల లోపల వయసు గల వారికి జీరో అకౌంట్ చేయబడు తుందన్నారు. సొంత మండలం అయిన రీజినల్ మేనేజర్ అమర్నాథ్‌రెడ్డి మాట్లాడుతూ మండలానికి నేషనల్ బ్యాంక్ రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు బరోడా బ్యాంక్‌ను సద్వినియం చేసుకోవాలని కోరారు. ఎటిఎం సౌకర్యం కూడా కల్పి కల్పించడం జరుగుతుందని చెప్పారు. డబ్బుల కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేదు ఇక్కడే ఏటీఎం సెంటర్లో డబ్బులు తీసుకోవచ్చన్నారు. వీరబల్లి మండలానికి నేషనల్ బ్యాంక్ ఆఫ్ బరోడా బ్యాంక్ తీసుకురావడం కృషిచేసిన ఆర్‌ఎం అమర్నాథ్‌రెడ్డికి మండల ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. వారికి శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో ఎంపిపి రాజేంద్ర నాథ్‌రెడ్డి, నాయకులు వీరనాగిరెడ్డి, ధర్మారెడ్డి, శ్రీధర్‌రెడ్డి, శివరాంగౌడ్, జెఎసి కరీంనగర్ నరేష్, ఎంపిటిసి పురుషోత్తంరెడ్డి, మండల ప్రజలు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రచారంలో పాల్గొంటే చర్యలు : ఎంపిడిఒ

ప్రజాశక్తి-రామాపురం

ఉపాధి సిబ్బంది ఎన్నికల ప్రచారంలో పాల్గొంటే వారిపై చట్టరీత్యచర్యలు తీసుకుంటామని ఎంపిడిఒ ప్రభాకర్ తెలిపారు. స్థానిక వెలుగు కార్యాలయంలో బుధవారం ఉపాధి ఫీల్డ్ సిబ్బందికి సమావేశం నిర్వహించారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల నియమావళి ఉల్లంఘిస్తే వారిపై చర్యలు తీసుకుంటామని అన్నారు. ఏ పార్టీకైనా సిబ్బంది ప్రచారంలో పాల్గొనవద్దని సూచించారు. ఉపాధి కూలీ లకు పనులు కల్పించాలని ఫీల్డ్ సిబ్బందికి తెలిపారు. కూలీల సంఖ్య పెంచాలని, నాణ్యమైన పనులు చేపట్టాలని పేర్కొన్నారు. ఎన్నికల నిబంధనలను ప్రతి ఒక్కరూ తప్పక పాటించాలని సూచించారు. నిబంధనలు అతిక్రమించి చర్యలకు లోనుకావద్దని చెప్పారు. కార్యక్రమంలో ఎపిఒ సురేంద్రనాథరెడ్డి, ఇసి శ్రీకాంత్‌రెడ్డి, టిఎలు, ఫీల్డ్ సిబ్బంది పాల్గొన్నారు.


ఉపాధి సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపిడిఒ ప్రభాకర్

పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు : డిఎస్‌పి


కేంద్ర బలగాలతో కవాతు నిర్వహిస్తున్న డిఎస్‌పి ప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలను మదనపల్లి నియోజకవర్గ వ్యాప్తంగా ప్రశాంత వాతావరణంలో నిర్వహిస్తామని మదనపల్లి డిఎస్‌పి ప్రసాద్‌రెడ్డి తెలిపారు. బుధవారం సాయంత్రం నిమ్మనపల్లి పోలీస్ స్టేషన్‌ను ఆయన సందర్శించారు. అనంతరం మదనపల్లి రూరల్ సర్కిల్ సిఐ సద్గురుడు, స్థానిక ఎస్‌ఐ లోకేష్‌రెడ్డి, కేంద్ర సిఆర్‌పిఎఫ్ బలగాలతో కలిసి పోలీస్ స్టేషన్ నుంచి వెంకోజిగారిపల్లి, నిమ్మనపల్లి, పాత బస్టాండు, తవళం క్రాస్, పెద్దమాదిగపల్లెలో ఎన్నికల నిర్వహణపై కవాతు నిర్వహించారు. ఓటర్లు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవచ్చని, ప్రశాంత వాతావరణంలో పోలింగ్ నిర్వహిస్తామని వారికి భరోసాను కల్పించారు. అనంతరం సార్వత్రిక ఎన్నికలు జరిగే ఆరు పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేయాలని, పోలీసులు తరచూ పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేస్తూ ఉండాలని సూచించారు. అనంతరం తవళం గ్రామంలో ఎన్నికల నిర్వహణపై కవాతు నిర్వహించి ఓటర్లకు తమ ఓటు ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో మదనపల్లి రూరల్ సర్కిల్ సిఐ సద్గురుడు, ఎస్‌ఐ లోకేష్‌రెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కడప ఎంపీ స్థానం మైనార్టీలకు ఇవ్వాలి

ప్రజాశక్తి - వేంపల్లె

కడప పార్లమెంటు టిడిపి సీటు ముస్లిం మైనార్టీ అభ్యర్థికి ప్రకటించాలని ఇడుపులపాయ యూనిట్ సభ్యులు పోతిరెడ్డి శివ, జబిబుల్లా, తొగటవీర క్షత్రియ సంఘం కార్యదర్శి మడక శ్రీనివాసులు కోరరు. బుధవారం వేంపల్లెలో వారు విలేకరులతో మాట్లాడుతూ కడప పార్లమెంటు టిడిపి సీటు మైనార్టీలకు ఇస్తే జిల్లా వ్యాప్తంగా ఉన్న మైనార్టీలు అందరూ ఓటు వేస్తారని చెప్పారు. మైనార్టీలకు సీటు కల్పిస్తే కడప పార్లమెంటు సీటుకు వేంపల్లెకు చెందిన సీనియర్ నాయకుడైన మహమ్మద్ షబ్బీర్ వలి కూడా అర్హుడని చెప్పారు. మహమ్మద్ షబ్బీర్ టిడిపి కోసం అహర్నిశలు శ్రమిస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో ఎన్టీఆర్ విగ్రహం ఎక్కడా లేనివిధంగా వేంపల్లెలో సొంత స్థలంలో ఏర్పాటు చేసినట్లు చెప్పారు. టిడిపి అధినేత చంద్రబాబు మైనార్టీలకు కడప సీటు ఇచ్చేలా ఆలోచించాలని వారు కోరారు.

ఘనంగా సీతారాముల విగ్రహ ప్రతిష్టాపన

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

మండల పరిధిలోని గోపులాపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ సీతారాముల దేవస్థానంలో బుధవారం సీతారాముల విగ్రహాల ప్రతిష్టా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి గ్రామ ప్రజలతోపాటు పరిసర గ్రామ ప్రజలు కూడా భారీగా పాల్గొన్నారు. వేద పండితులు విగ్రహ ప్రతిష్టలో భాగంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమం అనంతరం గ్రామ ప్రజల ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ చేశారు. జమ్మలమడుగు టిడిపి ఇన్చార్జ్ భూపేష్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట టిడిపి మండల అధ్యక్షులు మోహన్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, నల్లపురెడ్డి, వెంకట సుబ్బారెడ్డి, శ్రీనివాసులురెడ్డి ఉన్నారు.

ఆర్‌టిపిపి సిఇగా బాధ్యతలు చేపట్టిన గౌరీపతి

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

డాక్టర్ ఎంవిఆర్ ఆర్‌టిపిపి నూతన సిఇగా గౌరీపతి బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇఇఎఫ్‌ఎంఎన్ సిద్దయ్య, ఎస్పీఎఫ్ అసిస్టెంట్ కమాండర్ రాధాకృష్ణ, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ రమేష్, సబ్ ఇన్‌స్పెక్టర్ ఆధ్వర్యంలో కవాతు నిర్వహించి, పరిపాలన భవన్ వద్ద ఘన స్వాగతం పలికారు. అనంతరం ఇన్‌ఛార్జి సిఇ సోమశేఖర్‌రెడ్డి, నూతన చీఫ్ ఇంజనీర్ గౌరీపతికి బాధ్యతలు అప్పజెప్పారు. బాధ్యతలు చేపట్టిన గౌరీపతిని పలువురు యూనియన్ నాయకులు పుష్పగుచ్చాలు ఇచ్చి అభినందనలు తెలిపారు.

డిఎస్ఆర్ యువసేన ఆధ్వర్యంలో అన్నదానం

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పట్టణంలోని సెంటెన్స్ పాఠశాల సమీపంలో పునీత జోజప్ప మహోత్స వాలకు హాజరైన భక్తులకు డిఎస్ఆర్ యువసేన అధ్యక్షు డు అరకటవేములడేని ఆధ్వర్యంలో బుధవారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అన్నదానం చాలా గొప్ప దన్నారు.

వైభవంగా వెంకటేశ్వర స్వామి కల్యాణం

ఎర్రగుంట్ల : పంచాయతీ పరిధిలోని కోగటం రోడ్డులో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి దేవస్థాన పదవ వార్షికోత్సవం, వెంకటేశ్వర స్వామి కల్యాణోత్సవం బుధవారం వేలాది భక్తుల నడుమ వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామున స్వామి వారి అభిషేకం, హోమం తర్వాత శ్రీదేవి భూదేవి వెంకటేశ్వర స్వామి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా వేద పండితులచే ఘనంగా జరిపించారు. పట్టణ, చుట్టు ప్రక్కల గ్రామాల నుండి వేలాదిగా భక్తులు హాజరై కల్యాణోత్సవాన్ని తిలకించారు. అనంతరం దాతల సహకారంతో అన్న ప్రసాద వితరణ చేశారు. సాయంత్రం పట్టణ ప్రధాన రహదారుల వెంబడి గ్రామో త్సవం నిర్వహించారు. ప్రదర్శించిన కోలాటం ప్రజలను ఆకట్టుకుంది. భక్తులకు ఇబ్బందులు లేకుండా దేవస్థాన కమిటీ అన్ని ఏర్పాట్లు చేసింది.

పెద్దరికాన్ని గౌరవిస్తా : ఎమ్మెల్యే రాచమల్లు

ప్రజాశక్తి-పొద్దుటూరు

వయసురీత్యా వచ్చే పెద్దరికాన్ని, అనుభవాన్ని తానెప్పుడూ గౌరవస్తానని ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాదరెడ్డి అన్నారు. వైసిపి అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి ఇంట్లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తన రాజకీయ ప్రత్యర్థి అయిన టిడిపి అభ్యర్థి వరదరాజులరెడ్డి వయసును పదేపదే ప్రస్తావిస్తున్నందుకు బాధకలిగితే మన్నించాల న్నారు. మధ్య వయసులో ఉన్నప్పుడు చేయలేని ప్రొద్దుటూరు అభివృద్ధి వృద్ధా ప్యంలో చేస్తారా అన్నది తన ప్రధాన ప్రశ్న అన్నారు. టిడిపి హయాంలో ప్రొద్దు టూరుకు చేసిన అభివృద్ధిపై శ్వేతపత్రం విడుదల చేయాలని రాచమల్లు కోరారు.

వడ్డీ మాఫీ లబ్ధి పొందేందుకు 10 రోజులే గడువు

ప్రజాశక్తి -పులివెందుల రూరల్

పులివెందుల పురపాలక సంఘం పరిధిలోని ఆస్తి, ఖాళీ జాగా పన్ను చెల్లించేందుకు ఈనెల 31వరకు గడువు ఉందని కమిషనర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరం వరకే వర్తిస్తుందన్నారు. ఈ సదావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. సదరు ఆస్థి పన్ను బకాయిలను సంబంధిత వార్డు సచివాలయంలో కాని, ఆన్‌లైన్ (సిడిఎంఎ.ఏపీ.జీఓవి.ఇన్) ద్వారా కాని, పురపాలక సంఘ కార్యాలయపు ఖజానాలో సత్వరమే చెల్లించి రశీదు పొందాలన్నారు.

ఎర్రగుడిలో టిడిపి ఇంటింటి ప్రచారం

ప్రజాశక్తి -చక్రాయపేట

మండలంలోని ఎర్రగుడి గ్రామంలో టిడిపి మండల ఇన్‌ఛార్జి తాళ్లపల్లె మహేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో పులివెందుల అభ్యర్థి బీటెక్ రవి సోదరుడు మారెడ్డి జోగిరెడ్డితోపాటు కార్యకర్తలు ఇంటింటా ప్రచారం చేశారు. ముద్దప్పగారి పల్లె, బీసీ కాలనీ, పెడమల వాండ్లపల్లి, ఎర్రగుడి, బిఎన్ తండా, గరుగు తాం డాలో ప్రచారం చేశారు. కార్యక్రమంలో కార్యకర్తలు, అభిమానులు పాల్గొ న్నారు.


పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న సిఐ

'పది' పరీక్ష కేంద్రాలు తనిఖీ

ప్రజాశక్తి-బి.కొత్తకోట

పదో తరగతి పరీక్షలు జరుగుతున్న పరీక్ష కేంద్రాలను బి.కొత్తకోట సిఐ సూర్యనారాయణ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పట్టణంలోని పలు పరీక్ష కేంద్రాల దగ్గరికి వెళ్లి పరీక్షలు జరుగుతున్న తీరును పరిశీలించారు.ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ పరీక్ష కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పటిష్ట భద్రతను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలని సూచించారు. పరీక్ష కేంద్రాల పరిసరాలలో ఎవరు తిరగకూడదని అలా తిరిగితే చర్యలు తప్పవని హెచ్చరించారు. పదవ తరగతి విద్యార్థులు ప్రశాంతమైన వాతావరణంలో పరీక్షలు రాసి ఉత్తమ ఫలితాలు సాధించాలని తెలిపారు. సిఐ వెంట కానిస్టేబుల్ విశ్వనాథ్, హోంగార్డు అంబరీష్ ఉన్నారు.


ఇంటింటి ప్రచారంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు

వైసిపిని ఆదరించండి

ప్రజాశక్తి-కలికిరి

అభివృద్ధి కోసం మరోమారు వైసిపిని ఆదరించాలని ముస్లిం మైనార్టీ రాష్ట్ర కమిషన్ చైర్మన్ డాక్టర్ ఇక్బాల్ అహ్మద్, రాష్ట్ర వైసిపి కార్యదర్శి ఆగా మొహిద్దిన్ పేర్కొన్నారు. కలికిరి పంచాయతీ పరిధిలో కట్టకింద పాలెం1, కొత్తపేట స్ట్రీట్, మెయిన్ బజార్ స్ట్రీట్, జంగం స్ట్రీట్, పాత బస్టాండ్ , కొత్త వీధిలో గడప గడపకు తిరిగి వైసిపి ప్రభుత్వంలో చేపట్టిన సంక్షేమ పథకాల గురించి వివరించారు. పీలేరు ఎమ్మెల్యేగా చింతల రామచంద్రారెడ్డిని, ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో పీలేరు నియోజకవర్గ పరిశీలకులు సహదేవ రెడ్డి, ఎంపిపి వేంపల్లె నూర్జహాన్, జడ్‌పిటిసి కాకర్ల పద్మజ, నల్లారి శ్రీకర్ రెడ్డి, వైసిపి మండల అధ్యక్షులు చింతల రమేష్‌రెడ్డి, సతీష్‌రెడ్డి, రత్నసేఖర్‌రెడ్డి, మండల కో-ఆప్షన్ రిజ్వన్, ఎస్‌టిడి హరి, మహల్ సర్పంచ్ తస్లీమా రియాజ్‌లు పాల్గొన్నారు.



ఎన్నికల ప్రచారంలో జయచంద్రారెడ్డి, నాయకులు, కార్యకర్తలు

తంబళ్లపల్లెలో టిడిపి ప్రచారం

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

తంబళ్లపల్లెలో బుధవారం టిడిపి అభ్యర్థి జయచంద్రారెడ్డి ఎన్నికల ప్రచారం సాగించారు. మండల కేంద్రంలోని మొలకలచెరువు రోడ్డు, అంబేద్కర్ కాలనీ గ్రామాల్లో తిరుగుతూ కరపత్రాలు పంచుతూ టిడిపిని ఆదరించాలని కోరారు. మరో మారు గెలిపించాలని ఓటర్లను కోరారు. నియోజకవర్గ రాష్ట్ర అభివృద్ధి కోసం టిడిపికి తమకు మరో అవకాశం ఇవ్వాలని ఆయన కోరారు. సూపర్ సిక్స్ ఎన్నికల మ్యానిఫెస్టోను ఓటర్లకు వివరించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు నరసింహులు, గంగుల్‌రెడ్డి, రామచంద్ర, వెంకట సిద్ధులు, భార్గ వరెడ్డి, సాంబశివరెడ్డి, మ్యూజికల్ శివ, పాల్గొన్నారు.

క్రైం కార్నర్


ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన దంపతులు

భార్యాభర్తలు ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి-బి.కొత్తకోట

భార్యాభర్తలు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన బుధవారం బి.కొత్తకోటలో జరిగింది. జిల్లా ఆస్పత్రి ఔట్ పోస్టు పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పట్టణంలోని రాఘవేంద్ర వీధి (చర్చి దగ్గర) కాపురం ఉంటున్న దంపతులు బాలాజీ (35) అశ్వినికి (27)లకు తొమ్మిదేళ్ల క్రితం వివాహమైందని చెప్పారు. వివాహమై తొమ్మిదేళ్లయిన సంతానం కలుగక పోవడంతో తరచూ గొడవ పడుతుండే వారని చెప్పారు. బుధవారం మధ్యాహ్నం ఇద్దరూ గొడవ పడ్డారని, మనస్థాపం చెందిన అశ్విని ఇంట్లో వున్న పురుగుల మందు తాగడంతో గమనించిన భర్త బాలాజీ ఆ వెంటనే ఆమె దగ్గర ఉన్న పురుగు మందు డబ్బా తాను తీసుకొని తాగి ఆత్మ హత్యయత్నానికి పాల్పడ్డరని చెప్పారు కుటుంబీకులు గమనించి బాధితులను మదనపల్లి జిల్లా ఆస్పత్రికి తరలించారని చెప్పారు. డాక్టర్లు సకాలంలో వైద్యం అందించడంతో ప్రాణాపాయం తప్పి చికిత్స పొందుతున్నారని అన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

20 లీటర్లు నాటుసారా స్వాధీనం

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

నాటు సారా విక్రయ స్థావరంపై బుధవారం నిమ్మ నపల్లి పోలీసులు దాడులు నిర్వ హించారు. సారా విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ సి.లోకే ష్‌రెడ్డి తెలిపారు. బుధవారం రెడ్డి వారిపల్లి పంచాయతీ పిట్టా వాండ్లపల్లెకు చెందిన పారేసు వెంకటరమణ గ్రామ సమీపంలో నాటు సారా విక్రయిస్తున్నట్లు సమాచారం అందిందని చెప్పారు. తన సిబ్బందితో కలిసి దాడులు చేసి అతని వద్ద నుంచి 20 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నాటు సారా విక్రయిస్తూ పట్టుబడ్డ నిందితుడి పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు. మండలంలో నాటుసార తయారీ, రవాణా, విక్రయాలకు పాల్పడే వారి పై కఠిన చర్యలు చేపడుతున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు. ఈ దాడుల్లో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.


నిందితుడి అరెస్టును చూపుతున్న ఎస్‌ఐ